క్లుప్తంగా

నేడు వెంకటగిరిలో పోరుబాట

వెంకటగిరి(సైదాపురం) : కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టనున్నట్లు నేదురుమల్లి కార్యాలయం నుంచి గురువారం వెలువడిన ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యకర్తలు, నాయకులు శుక్రవారం ఉదయం 8 గంటలకు వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసం వద్దకు రావాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పాలకేంద్రం సబ్‌స్టేషన్ వద్ద పోరుబాట కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

హడలిపోతున్న వాహనదారులు

సైదాపురం: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి సైదాపురం తహసీల్దార్ కార్యాలయం వరకు ఉన్న రోడ్డు మార్గం అధ్వానంగా తయారైంది. దీనికితోడు రహదారి పనులు చేస్తుండడంతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట : పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం సమీపంలోని 33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో సీరియల్ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పవర్ కట్ చేస్తున్నట్లు ఏఈ మురళీ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి 12 దాకా రైల్వేస్టేషన్ రోడ్డు, పార్కువీధి, పొట్టి శ్రీరాములు వీధిలో కరెంట్ ఉండదని తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల దాకా పరమేశ్వరి నగర్, సాయినగర్, గాండ్లవీధి ప్రాంతాల్లో కరెంట్ ఉండదని చెప్పారు. ప్రజలు విద్యుత్ అంతరాయానికి సహకరించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

పాసు పుస్తకాలకు అధిక అర్జీలు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌ఏ సాగరం వార్డు సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహశీల్దారు రాజేంద్ర , మండల ప్రత్యేక అధికారి, డివిజనల్ సర్వేయర్ అధ్యక్షతన ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్జీలను స్వీకరించారు. పాసు పుస్తకాలకు 21, భూముల సర్వేకు 9, పలు సమస్యలపై 10 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి తేజ వెల్లడించారు. సదస్సులో దేవాదాయ శాఖ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని నిరసన

వెంకటగిరిరూరల్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ జీతాలను సకాలంలో చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నిరంగాల్లో ఉన్న కార్మికులతో పాటు మున్సిపల్ కార్మికులకు ఆశ చూపి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడు నెలలు కావొస్తున్నా.. నేటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ జీతాలను చెల్లించాలన్నారు. జీఓ నెం.36 ప్రకారం చెత్త డ్రైవర్లకు రూ.24,500 చెల్లించాల్సి ఉండగా ఈ మేరకు చెల్లించకుండా వెంకటగిరి మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నాయుడుపేటటౌన్ : ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ మృతి చెందిన సాయిమోహన్ రెడ్డి కుటుంబ సభ్యులకు గురువారం యూటీఎఫ్ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష నగదు చెక్కును ఆ సంఘం నాయకులు అందించారు. దొరవారిసత్రం మండలం పూలతోట పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సాయి మోహన్ రెడ్డి పనిచేస్తూ ఈనెల 22 తేదీన మృతి చెందారు. దీంతో యూటీఎఫ్ సభ్యులు ఆ సంఘం కుటుంబానికి సంక్షేమ నిధి నుంచి నగదు చెక్కును అందించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

సైదాపురం: ఎరువుల దుకాణదారులు రైతులకు అధిక ధరకు యూరియాను విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారి హైమావతి హెచ్చరించాచారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని పీఏసీఎస్‌లకు 60 మెట్రిక్ టన్నులు, ఆర్‌ఎస్‌కేలకు 160 మెట్రిక్ టన్నులు యూరియాను సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ మేరకు రైతులు సమీపంలో ఉన్న పీఏసీఎస్, ఆర్‌ఎస్‌కేల వద్దకు పాసుబుక్, ఆధార్‌కార్డులు తీసుకెళ్లి యూరియా తెచ్చుకోవాలని సూచించారు. ఎరువుల దుకాణదారులు స్టాక్ వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలని హెచ్చరించారు.

టెన్నికాయిట్ జిల్లా జట్లు ఎంపిక

గూడూరు రూరల్: ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ జట్లను గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో గురువారం ఎంపిక చేశారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్ మాట్లాడుతూ 40 మంది ఎంపికల్లో పాల్గొనగా 8 మందిని ఎంపిక చేశామన్నారు. బాలికల విభాగంలో కావలికి చెందిన మానస, గూడూరుకు చెందిన దాక్షాయిని, ఈశ్వరమ్మ, ప్రసన్న ఎంపికయ్యారన్నారు. బాలుర విభాగంలో దొరవారిసత్రానికి చెందిన ప్రణీత్‌కుమార్, జస్వంత్, కొండాగుంటకు చెందిన లక్షిత్, యశ్వంత్ ఎంపికైనట్లు తెలిపారు.

చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాల



మూడు తరగతులకు కలిపి ఒకే గదిలో పరీక్ష పెడుతున్న ఉపాధ్యాయుడు



పాఠం.. దూరం

గిరిజనుల్లో పేదరికానికి అడ్డుకట్ట వేసే ఉన్నత లక్ష్యంతో వారి విద్యాభివృద్ధి కోసం గురుకులాలు ఏర్పాటు చేశారు. వీటిలో రెగ్యులర్ ఉద్యోగుల నియామకం లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులతోనే ఏళ్ల తరబడి నెట్టుకొస్తున్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు నెల రోజులుగా సమ్మెబాట పట్టారు. దీని ప్రభావం విద్యార్థులపై పడడంతో పాఠాలు చెప్పేవారు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సిలబస్ పూర్తికాక పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్న పరిస్థితి గిరిజన గురుకులాల్లో కనిపిస్తోంది. – కోట

- సమ్మెలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు
- గిరిజన గురుకులాల్లో విద్యార్థుల అవస్థలు



ఉపాధ్యాయులు లేక విద్యార్థులే చదివిస్తున్న దృశ్యం

మండలంలో రెండు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. చిట్టేడులోని బాలుర గురుకుల పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 334 మంది పిల్లలు చదువుతున్నారు. ఒక ప్రిన్సిపల్, 26 మంది అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులతో పాఠశాల నడుస్తోంది. గత నెల 16 నుంచి మొత్తం 26 మంది అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో పాల్గొంటూ విధులకు హాజరు కావడం లేదు. ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి. పదో తరగతి విద్యార్థులు 40 మంది ఉన్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు సిలబస్ పూర్తికాక, పరీక్షలు సమీపిస్తుండడంతో ఒత్తిడికి గురవుతున్నారు. కోటలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ 255 మంది బాలికలు ఆశ్రయం పొందుతుండగా మొత్తం 8 మంది ఉపాధ్యాయులు సమ్మెలో ఉన్నారు. ఇక్కడ పదో తరగతి విద్యార్థులు 31 మంది ఉన్నారు.

రంపచోడవరం నుంచి వచ్చి..

పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థులు తరగతి గదుల్లో ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి రావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. అల్లూరి జిల్లా రంపచోడవరం నుంచి ఉపాధ్యాయులను తాత్కాలికంగా నియమించారు. చిట్టేడు బాలుర గురుకుల పాఠశాలకు నలుగురిని, కోటలోని బాలికల గురుకుల పాఠశాలకు మరో నలుగురిని నియమించారు. చిట్టేడులో 16 సెక్షన్లకు నలుగురు ఉపాధ్యాయులు బోధన చేయడం కష్టంగా మారుతోంది. దీంతో విద్యార్థులందరినీ ఒకే గదిలో ఉంచి చదివిస్తున్నారు. హిందీ, సోషల్ సబ్జెక్టులకు అసలు ఉపాధ్యాయులే లేరు. ఉపాధ్యాయుల కొరతతో చదువులు కుంటుపడుతున్నాయి. మరోవైపు రంపచోడవరం నుంచి వచ్చిన ఉపాధ్యాయుల పరిస్థితి దీనంగా ఉంది. అందరూ 50 ఏళ్లు పై బడిన వారే కావడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మూడు రోజులే అని చెప్పి ఇక్కడకు పంపారని, కుటుంబాలను వదిలి వచ్చి నెలరోజులవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 700 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి ఇక్కడ సరైన ఆహారం లేక పని ఒత్తిడితో సతమతమవుతున్నట్లు తెలిపారు.

చొరవ చూపని ప్రభుత్వం

40 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అవుట్‌సోర్సింగ్ బోధన సిబ్బంది సమ్మెలో ఉండడంతో విద్యార్థుల చదువులు అటకెక్కాయి. రాష్ట్రంలోని 199 గిరిజన గురుకుల విద్యాలయాల్లో 1700 మంది ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉన్నారు. పనిభారం అధికంగా ఉన్నా తక్కువ వేతనాలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వ చిన్నచూపు చూస్తోంది. ఉద్యోగ భద్రత కల్పించాలి, పోస్టులకు డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలి, వేతనాలు పెంచాలి, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలి తదితర డిమాండ్లతో సమ్మెబాట పట్టినట్లు వారు తెలిపారు.

తరగతులు సరిగా జరగడం లేదు

గత నెలరోజులుగా సక్రమంగా క్లాసులు జరగడం లేదు. పదో తరగతిలో మాకు ఇంకా సిలబస్ పూర్తి కాలేదు. ఉపాధ్యాయులు రాకపోవడంతో మాకు పాఠాలు చెప్పే వారు లేరు. పబ్లిక్ పరీక్షలు రాయాలంటే మేం చాలా కష్టపడాలి. ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించి మాకు న్యాయం చేయాలి.

– వేణు, పదో తరగతి విద్యార్థి, చిట్టేడు

పబ్లిక్ పరీక్షలకు కష్టపడాలి

ఉపాధ్యాయుల సమ్మెతో పదో తరగతి విద్యార్థులకు కష్టాలు తప్పవు. సిలబస్ పూర్తయితేనే కష్టపడి చదువుకోగలం. టీచర్లు రాకపోవడంతో చదివించే వారు కూడా లేదు. మాకు వెంటనే సిలబస్ పూర్తి చేయించే విధంగా ఉపాధ్యాయులను నియమించాలి.

– శ్రీహరి, పదో తరగతి విద్యార్థి, చిట్టేడు

ఉండాలంటే కష్టంగా ఉంది

ఉన్నతాధికారుల ఆదేశాలతో రంపచోడవరం నుంచి వచ్చాం. మూడు రోజులే అన్నారు. 30 రోజులు దాటింది. కుటుంబాలకు దూరంగా ఉంటూ ఒత్తిడికి గురవుతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలి.

– రఘుకుమార్, ఉపాధ్యాయుడు, రంపచోడవరం

మత్స్యకార గ్రామాల్లో శాంతి పూజలు



సముద్రం వద్ద పూజలు నిర్వహిస్తున్న మత్స్యకారులు

వాకాడు: సముద్రంలో సునామీ సంభవించి నేటికి 20 ఏళ్లు పూర్తి కావడంతో గురువారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో మత్స్యకార మహిళలు ప్రత్యేక శాంతి పూజలు నిర్వహించారు. 2004 డిసెంబర్ 26న సంభవించిన సునామీ ఒక్క సారిగా విలయ తాండం చేయడంతో సముద్రం ఉప్పొంగింది. తీర ప్రాంత మండలాలు వాకాడు, కోట, చిల్లకూరు, తడ, సూళ్లూరుపేట అతలాకుతలమయ్యాయి. అప్పుడు జరిగిన తీవ్ర నష్టాన్ని నేటికి తీరప్రాంత ప్రజలు మర్చిపోలేదు. అలాంటి సంఘటనలు మళ్లీ రాకూడదని మత్స్యకారులు తీరంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు



చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం ఆరూరు గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు నిలిచి పోవడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. గురువారం సూళ్లూరుపేట నుంచి కోటకు బయల్దేరిన ఆర్టీసీ బస్సు ఆరూరు గ్రామ సమీపంలోకి వచ్చే సరికే అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతల్లోకి దిగబడి పోయింది. దీంతో బస్సు కదలేక పోయింది. అందులో ప్రయాణిస్తున్న వారు సుమారు గంటకు పైగా అక్కడే నిరీక్షించి అటు తరువాత వచ్చిన బస్సుల్లో కోటకు వెళ్లాల్సి వచ్చింది.

పోరుబాటకు తరలిరండి



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలపై తప్పుడు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే చార్జీలను పెంచడం దారుణమని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు సనత్ నగర్లో ఉన్న ఆయన నివాసంలో గురువారం వివిధ మండలాలకు చెందిన వైఎస్‌ఆర్ సీపీ నాయకులతో కలసి విద్యుత్ చార్జీల పెంపుపై శుక్రవారం చేపడుతున్న పోరుబాట కార్యక్రమం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాలలో విద్యుత్ సబ్ స్టేషన్‌ల వద్ద పోరుబాట కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. అధికారం చేపట్టిన టీడీపీ ఏకంగా కోట్ల భారం పేదలపై మోపేందుకు సిద్ధం కావడం దురదృష్టం అని అన్నారు. గూడూరు పటట్ణంలోని ఐసీఎస్‌రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి కార్యకర్త, అభిమానులు, నాయకులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

'పోరుబాట' విజయవంతం చేయండి

– మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



నాయుడుపేటటౌన్ : కరెంటు చార్జీలు పెంచేది లేదని, మోసపూరిత హామీలను ఇచ్చి ప్రజలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుపై వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సన్నద్ధమైనట్లు ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మోసాలను ఎండగడుతూ నాయుడుపేట పట్టణంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు నియోజవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున బైక్‌లతో నిరసన ర్యాలీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి పిచ్చిరెడ్డితోపు వీధిలో ఉన్న విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు ఈ ర్యాలీ చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే పోరుబాటను విజయవంతం చేయాలని సంజీవయ్య పిలుపునిచ్చారు. నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీలతో పాటు ఆరు మండలాలకు చెందిన రైతులు, ప్రజలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

సైదాపురం: రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని, అందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ అన్నారు. మండలంలోని గిద్దలూరు గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల వద్ద నుంచి అధిక సంఖ్యలో సమస్యలపై అర్జీలు స్వీకరించినట్లు డీటీ తెలిపారు.

రెవెన్యూ సదస్సులో 8 అర్జీలు

పెళ్లకూరు : మండలంలోని రోసనూరులో గురువారం జరిగిన రెవెన్యూ గ్రామసభకు ఎనిమిది అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి తెలిపారు. భూములకు హద్దులు చూపాలని ఇద్దరు రైతులు అర్జీలు పెట్టుకోగా, గ్రామ సమీపంలోని అటవీ భూముల సాగు కోసం అనుమతులు ఇవ్వాలని కొంత మంది పేదలు విన్నవించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషిణిభాయి, వీఆర్వో వంశీ, సర్వేయర్ సూర్య, నాయకులు సత్యంరాజు, కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, మురళీనాయుడు పాల్గొన్నారు.

ఓజిలి : మండలంలోని ఇనుగుంట, రాజానగరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను తహశీల్దార్ పద్మావతి గురువారం నిర్వహించారు. గ్రామాల్లో భూసమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు ఉపయోగపడుతాయని తెలిపారు. ఆమె వెంట వీఆర్వో నిరంజన్, సర్వేయర్ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు కాటూరు ఫణేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో రైతుల వినతి

వెంకటగిరిరూరల్: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ రాంబాబు తెలియజేశారు. పట్టణంలోని సుదర్శన నగర్‌లో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ధర్మాపురం ఆయకట్టు రైతులు పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి రీసర్వే, డాక్యుమెంట్లలో ఉన్న పొరపాట్లను సరిచేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజేష్, వీఆర్వో వాణి, 14వ వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య స్థానికులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలవుతున్నా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులుగా పని చేసే వారికి 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ బెనిఫిట్స్, పరిహారం, దహన సంస్కారాలు ఆర్థిక సాయం, ఇంజినీరింగ్ కార్మికులకు జీతాల పెంపు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం కారణంగా ఎంతో మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్, సీఐటీయూ నాయకులు, డి.కోటేశ్వరరావు, ప్రసాద్, మురళీ, మణెమ్మ, ప్రభావతి, వెంకటరమణయ్య, శాంతివర్ధన్, ఆనంద్, బీవీ రమణయ్య, సురేష్, పామంజి మణి, పుట్టా శంకరయ్య పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట మండలం పండ్లూరు గ్రామంలో వెలసిన హజరత్ ఖాదర్ వలీ గంధోత్సవ వేడుకలను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గ్రామంలో గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చారు. హిందువులు సైతం ఇంటి నుంచి నిషాన్ జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాలో ప్రతిష్ఠించి ఫాతేహాలు జరిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దర్గా నిర్వాహకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు తరలిరండి

నాయుడుపేట టౌన్ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో జరిగే యూటీఎఫ్ విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు తరలిరావాలని ఆ సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం సాయంత్రం రాష్ట్ర మహాసభలకు సంబంధించి పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా, డివిజన్ పరిధిలోని నాయకులు పాల్గొన్నారు.

జామాయిల్ సాగును అడ్డుకోవద్దని వినతి



ఫారెస్టు అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

పెళ్లకూరు : అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న జామాయిల్ సాగును అడ్డుకోవద్దని రోసనూరు, కిష్టప్పకండ్రిగ గిరిజనులు గురువారం స్థానిక ఫారెస్టు అధికారి శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందించారు. రోసనూరు, కిష్టప్పకండ్రిగ గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు గ్రామంలో ఉన్న అటవీ భూముల్లో జామాయిల్ సాగు చేసుకోవడానికి కొంత భూమిని చదును చేసుకున్నట్లు వివరించారు. అయితే అటవీ సిబ్బంది జామాయిల్ మొక్కలు నాటడాన్ని అడ్డుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

నాణ్యత ప్రమాణాలపై ఆరా



పశువుల షెడ్‌ను తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్‌బాబు

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను నాణ్యంగా జరిగేలా చూడాలని రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్‌బాబు సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పశువుల షెడ్‌లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓడూరు గ్రామంలో పాడి రైతులు నిర్మించుకున్న పశువుల షెడ్‌ను తనిఖీ చేశారు. అందుకు సంబంధించిన పూర్తి బిల్లులు చెల్లింపులు జరిగాయా అని అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తి చేసే సమయంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, అలా లేకుండా ఉంటే రికవరీ చేస్తామన్నారు. అలాగే గ్రామంలో వేసిన సీసీ రోడ్లు పరిశీలించారు. అనంతరం నెలబల్లిరెట్టపల్లిగ్రామంలో వేసిన సీసీ రోడ్లు తనిఖీ చేసి కొలతలు తీసుకున్నారు. ఆయన వెంట ఉపాధి ఏపీఓ గిరిబాబు, సిబ్బంది ఉన్నారు.

పీఎస్-4 ఎక్స్‌పెరిమెంట్ ఆర్బిట్ మాడ్యూల్‌లో స్వేచ్ఛ శాట్



కొత్తమాను సాయిదివ్య



పీఎస్-4 ఆర్బిట్ ప్రయోగాత్మక మాడ్యూల్‌లో పంపిస్తున్న బుల్లి ఉపగ్రహం స్వేచ్ఛశాట్

సూళ్లూరుపేట: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఈనెల 30న ప్రయోగించనున్న పీఎస్‌ఎల్‌వీ–సీ60 ప్రయోగంలో భాగంగా పీఎస్–4 ఆర్బిట్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్‌లో పంపనున్న 24 పేలోడ్స్‌లో స్వేచ్ఛశాట్ అనే ఓ బుల్లి ఉపగ్రహాన్ని పంపనున్నారు. తెనాలికి చెందిన ఎన్ స్పేస్ టెక్ అనే ప్రైవేట్ అంతరిక్ష సంస్థ భాగస్వామ్యం కానుంది. రాష్ట్రంలోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొత్తమాను సాయిదివ్య ఎన్ స్పేస్ టెక్ వ్యవస్థాపకురాలిగా ఈ బుల్లి ఉపగ్రహాన్ని తయారు చేసుకుని ఇస్రో సహకారంతో ప్రయోగించనున్నారు. తమ ఉపగ్రహం కక్ష్యలోకి చేరాక ఇస్రోకు సంకేతాలు పంపితే తమ ప్రయత్నం ఫలించినట్టవుతుందని ఆమె చెబుతున్నారు. స్వేచ్ఛశాట్ విజయవంతమైతే వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.

సగుటూరు వద్ద వరి పంటకు యూరియా చల్లుతున్న రైతులు, మానమాల చెక్‌డ్యాంలో నిలిచిన వర్షపు నీరు





ఆలస్యంగా వరి నాట్లు

ఓజిలి: వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరి నాట్లు పలు గ్రామాల్లో ఆలస్యం అయ్యాయి. మండల పరిధిలోని మాచవరం, ముమ్మాయపాళెం, ఆర్మేనిపాడు, ఓజిలి, చిలమానుచేను తదితర గ్రామాల్లో నాట్లు ఆలస్యంగా ప్రారంభయ్యాయి. వరుస తుపాన్‌ల నేపథ్యంలో చెరువులకు వర్షపు నీరు పుష్కలంగా చేరింది. మండలంలో మొత్తం 4,600 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. నాట్లు , కలుపుతీత , తదితర పనుల్లో రైతులు బీజీబీజీగా గడుపుతున్నారు.

నిండిన చెక్‌డ్యాంలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలోని మానమాల, కురుగొండ, పున్నేపల్లి, నెమళ్లపూడి, కర్రబల్లవోలు, మేనకూరు గ్రామాల వద్ద రైతుల సౌకర్యార్థం చెక్‌డ్యాం నిర్మాణాలు చేపట్టారు. ఈ మామిడి కాలువ పరిసరాల్లో దాదాపుగా 10 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. వర్షపు నీరు చెక్‌డ్యాంల వద్ద నిలబడుతుండడంతో మోటార్లుకు నీరు పుష్కలంగా అందుతోంది. నీళ్లు నిండి చెక్‌డ్యాంలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.